www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 301 శనివారం 28-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 05 వెల : 5



మైనారిటీల ఓట్లు కావాలి..
సంక్షేమం మాత్రం వద్దా?

- హామీల హోరు.. అమలులో జీరో!
- ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన, రేవంతన్నా కా సహారా పథకాలు ఎక్కడ?
- 12 శాతం రిజర్వేషన్ల హామీని గాలికొదిలేశారా?
- మైనారిటీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న పాలకులు
- మాటలతో మభ్యపెట్టడం మానుకోవాలి
- ఏఎండీఆర్ ఫౌండేషన్ ఫౌండర్ ఆదిల్ ఘాటు విమర్శలు

కొత్తగూడెం, నవంబర్ 27 (భద్రాద్రిన్యూస్) :-

ఎన్నికలొస్తే ముస్లిం మైనారిటీలు గుర్తుకొస్తారు.. ఓట్లు కావాలంటే సంక్షేమ హామీల వరద పారిస్తారు.. అధికార పీఠం దక్కగానే ఆ హామీలన్నీ అటకెక్కుతాయా? ఇదేనా మైనారిటీల పట్ల పాలకుల చిత్తశుద్ధి? సభల్లో గొప్ప ప్రకటనలు.. ప్రచారంలో ఆకర్షణీయమైన పథకాల పేర్లు.. కానీ పేద మైనారిటీ కుటుంబాల గడపకు మాత్రం సంక్షేమ ఫలాలు చేరడం లేదనే మిగతా 3లో..



ఆకలి తీర్చి...అక్షరాలకు
వెలుగులు దిద్దుతున్న సింగరేణి

తెలంగాణ బ్రేక్‌ఫాస్ట్ పథకానికి సింగరేణి అండ

- రూ.61.44 కోట్ల సీఎస్ఆర్ సహకారం
- తొమ్మిది చోట్ల సెంట్రలైజ్డు వంటశాలల ఏర్పాటుకు చేయూత
- 4 లక్షల మంది బడి పిల్లలకు లబ్ధి
- ఇప్పటికే కొడంగల్, మంచిర్యాల, మంథని, మధిరలో ప్రారంభం
- త్వరలో సింగరేణి, సూర్యాపేట, కొత్తగూడెం, కాగజ్ నగర్, భూపాలపల్లి కిచెన్లు

కొత్తగూడెం సింగరేణి , నవంబర్ 27, (భద్రాద్రిన్యూస్):-

"బడిలో విద్యార్థులు పుస్తకం తెరిచే ముందు కడుపులో వారి ఆకలి మంట చల్లారాలి. బడి గంట మోగే వేళ పిల్లల మనసు చదువుపై నిలవాలంటే.. ఉదయాన్నే పౌష్టిక అల్పాహారం అందాలి. ఎట్టిప రిస్థితుల్లోనూ ఆకలి బాధ చదువుకు అడ్డంకి కాకూడదు " అనే మంచి సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తెలంగాణ బ్రేక్‌ఫాస్ట్ పథకానికి సింగరేణి సంస్థ తన సామాజిక బాధ్యతతో అండగా నిలుస్తోంది. గ్రామీణ, పేద విద్యార్థుల ఆకలి తీర్చి, వారి చదువుకు తోడ్పడే ఈ కార్యక్రమానికి రూ.61.44 కోట్ల ఆర్థిక మిగతా 4లో..

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా
నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

- అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా విస్తృత అవగాహన కల్పించాలి
- రుద్రంపూర్‌లో నమోదు శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్



2

ప్రజలకు మరింత మెరుగైన
ట్రాఫిక్ సేవలు అందించాలి

- వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి
- ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సీపీ కార్యాలయం తనిఖీ చేసిన భద్రాద్రి జోన్ ఇన్‌చార్జి డీఐజీ ఎన్. శ్వేత



5



విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం...

- వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రభుత్వ విద్యా అవకాశాలను బలహీన వర్గాలు సద్వినియోగం చేసుకోవాలి
- స్థానిక జహీర్‌పురాలో రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీసీ బాలికల హాస్టల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ - 27 (భద్రాద్రిన్యూస్):-

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మంత్రి, స్థానిక జహీర్ పుర లో రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక వసతులతో నిర్మించనున్న బీసీ బాలికల హాస్టల్ భవన పనులకు శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.భావితరాల పిల్లలకు సకల విద్యా సౌకర్యాలు అందిస్తే వారు సాధించలేనిది ఏదీ ఉండదనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఖమ్మం నగరంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల విద్యా సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో ఖమ్మం జిల్లాకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, స్వామినారాయణ వంటి ప్రైవేట్ విద్యాసంస్థలు, మెడికల్ కాలేజీని తీసుకురావడం జరిగిందని తెలిపారు. ప్రపంచానికే తలమానికంగా నిలిచేలా కొత్తగూడెంలో మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ మిగతా 4లో..

దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన డీఎస్పీ అరుణ్ కుమార్

- **పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగం పెంచాలి.. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా**

దుమ్ముగూడెం, నవంబర్ 27 (భద్రాద్రి న్యూస్):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌ను వార్షికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న డీఎస్పీకి దుమ్ముగూడెం సీఐ వెంకటప్పయ్య పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ సిబ్బంది నుంచి డీఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, కార్యాలయ నిర్వహణ, వివిధ రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణ తీరును డీఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తుల పురోగతి, నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ప్రాపర్టీ కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించి, దొంగిలించబడిన ఆస్తులను త్వరితగతిన స్వాధీనం చేసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించేందుకు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

అక్రమ ఇసుక రవాణా, గంజాయి అక్రమ రవాణా, మట్కా, జూదం, పేకాట, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వాటికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వారు మోసాల బారిన పడకుండా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని డీఎస్పీ అరుణ్ కుమార్ సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో ఎస్ఐ శ్యాంప్రసాద్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





మాజీ హోమ్ శాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు కు మాజీ ఎంపీ నామ పరామర్శ

- **వసంత హైమావతి భౌతిక కాయానికి మాజీ ఎంపీ నామ ఘన నివాళి**

ఖమ్మం ప్రతినిధి ,నవంబరు 27 (భద్రాద్రిన్యూస్):-

ఉమ్మడి రాష్ట్ర మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు సతీమణి, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాతృమూర్తి వసంత హైమావతి మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం కృష్ణా జిల్లా నందిగామ మండలం ఐతవరంలోని వారి స్వగృహానికి చేరుకున్న నామ నాగేశ్వరరావు వారి కుమారుడు నామ భవ్య తేజ హైమావతి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వసంత నాగేశ్వరరావు, కృష్ణప్రసాద్ లతో పాటుగా కుటుంబ సభ్యులతో మాట్లాడి పరామర్శించారు . హైమావతి మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఐతవరం గ్రామ సర్పంచిగా హైమావతి గ్రామాభివృద్ధికి చేసిన సేవలను నామ కొనియాడారు. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలిచి సేవలందించిన ఆమె మృతి తీరని లోటని పేర్కొన్నారు. హైమావతి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని నామ ఆకాంక్షించారు.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా విస్తృత అవగాహన కల్పించాలి**
- **రుద్రంపూర్‌లో నమోదు శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్**

చుంచుపల్లి, నవంబర్ 27 (భద్రాద్రి న్యూస్):

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా నమోదు ప్రక్రియ, లబ్ధిదారుల వివరాల సేకరణ, ఆన్‌లైన్ నమోదు విధానం, నామినీ వివరాల నమోదు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రేషన్ కార్డు ఆధారంగా లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులు ఈ పథకంలో నమోదు చేసుకోవచ్చని, రేషన్ కార్డు ఆధారంగా వివరాలను నమోదు చేసి నామినీ వివరాలను తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. రేషన్ కార్డులో సభ్యుల వివరాలు అందుబాటులోకి వస్తాయని, కార్డులో సభ్యులు లేని సందర్భాల్లో కూడా ఇతర వ్యక్తులను నామినీగా ఎంపిక చేసుకునే అవకాశం ఉందని అధికారులు వివరించారు.

రైతు బీమా, నేతన్న బీమా, గీత కార్మికుల బీమా, మత్స్యకారుల బీమా వంటి ఇతర ప్రభుత్వ బీమా పథకాల పరిధిలో ఇప్పటికే ఉన్నవారి వివరాలను కూడా నమోదు సమయంలో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. నమోదు పూర్తయిన అనంతరం లబ్ధిదారులకు రసీదు అందజేయడంతో పాటు లావాదేవీ గుర్తింపు సంఖ్య, నమోదు సంఖ్య, బీమా పొందే వ్యక్తి వివరాలు, నామినీ పేరు, వారితో ఉన్న సంబంధం తదితర వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి లబ్ధిదారుల సంతకాలు తీసుకోవాలని తెలిపారు.

గ్రామాల వారీగా నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. రుద్రంపూర్ గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 1,250 రేషన్ కార్డులు ఉండగా, మొదటి రోజు 65 మందికి సంబంధించిన వివరాలను నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి నమోదు ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. నమోదు సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నమోదు శిబిరాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, నమోదు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

అనంతరం నమోదు ప్రక్రియ పూర్తిచేసుకున్న లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా నమోదు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. పథకం ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ పరిశీలనలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో సుభాషిని, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





క్రీడా ప్రతిభతో రాష్ట్రస్థాయిలో రాణించి పాఠశాలలకు పేరు తీసుకురావాలి

- **గిరిజన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి.. క్రీడలతో శారీరక, మానసిక వికాసం**
- **కిన్నెరసానిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్–17 జోనల్ క్రీడా ఎంపికలను ప్రారంభించిన ఐటీడీఏ పీవో రాహుల్**

పాల్వంచ, నవంబర్ 27 (భద్రాద్రి న్యూస్):-



గిరిజన విద్యార్థులు చదువుతోపాటు తమకు ఇష్టమైన క్రీడల్లో పాల్గొని, దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ పిలుపునిచ్చారు. క్రీడల్లో విజయాలతో తమ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా జోనల్ స్థాయి ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల అండర్-17 బాలబాలికల క్రీడా పోటీలు, రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికలను ఐటీడీఏ పీవో రాహుల్ ముఖ్యఅతిథిగా పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకొని, నిరంతర సాధనతో తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తూ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చాటాలని, పాఠశాలకు, జిల్లాకు గౌరవం తీసుకురావాలని అన్నారు. క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. తొలి రోజు అండర్-17 విభాగంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, క్యారమ్స్, చెస్, టెన్నికాయిట్, ఆర్చరీ క్రీడల్లో ప్రతిభ, నైపుణ్యం ప్రదర్శించిన బాలబాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. శనివారం నవంబర్ 28న అండర్-14 విభాగంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా జోనల్ స్థాయి బాలబాలికల ఎంపికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం డీడీ ట్రైబల్ వెల్ఫేర్ చందన, ఖమ్మం డీడీ ట్రైబల్ వెల్ఫేర్ ఫిరంగి, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, ఏటీడీవోలు చంద్రమోహన్, భారతి, రాధమ్మ, రమేష్, ఖమ్మం ఏసీఎంఓ రాములు, ఏఎస్ఓలు వెంకట్ నారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, శంకర్రావు, హెచ్ఎం యస్. చందు, పీడీలు బాలసుబ్రమణ్యం, నగేష్, సైదులు, మోతిలాల్, హరికృష్ణ, వెంకన్న, శిరోమణి, ప్రత్యూష, నాగమణి, కోచ్‌లు నాగరాజు, ప్రసాద్, హత్తిరామ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- **బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో ఆర్థిక భరోసా**
- **పాత పాల్వంచ 46వ డివిజన్‌లో బీమా నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన కొత్వాల, విమలాదేవి**



పాల్వంచ నవంబర్ 27 (భద్రాద్రి న్యూస్):

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తూ, బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని పాల్వంచ సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించే కార్యక్రమమని పేర్కొన్నారు. పాల్వంచ పట్టణంలోని పాత పాల్వంచ 46వ డివిజన్‌లో శుక్రవారం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కార్యక్రమాన్ని కార్పొరేటర్ కొత్వాల విమలాదేవితో కలిసి కొత్వాల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నమోదు ప్రక్రియను పరిశీలించి, సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కొత్వాల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాల సంక్షేమం, ప్రజల ఆర్థిక భద్రత, సామాజిక అభివృద్ధిలక్ష్యంగా పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అర్హులైన కుటుంబాలకు భరోసా కల్పిస్తూ ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతుందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, వార్డు ఆఫీసర్ దామెర్ల నరేష్, ఏఈఈ నవీన్, వివిధ డివిజన్ల వార్డు ఆఫీసర్లు సందీప్, నరేష్, ప్రశాంత్, రవీందర్, వరుణ్, ఆర్పీలు అరుణ, నాగమణి, పుష్ప, కాంగ్రెస్ నాయకులు ఎస్. ఖాజామియా, కరీం, బొందిల శేషగిరి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు

- **చేయూత పింఛన్లు ఖాతాల్లో జమ.. లబ్ధిదారుల్లో హర్షా తిరేకాలు**
- **పాత పాల్వంచ 46వ డివిజన్‌లో సంబరాలు.. సీఎం, మంత్రుల ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేసిన కొత్వాల, విమలాదేవి**

పాల్వంచ, నవంబర్ 27(భద్రాద్రి న్యూస్):

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పాల్వంచ సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. చేయూత పింఛన్ల నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కావడంతో పాత పాల్వంచలోని 46వ డివిజన్‌లో లబ్ధిదారులు సంబరాలు నిర్వహించి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్కల ఫ్లెక్సీలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు, మహిళలు తమ ఆశీర్వాదం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.కె. ఖాజామియా, షేక్ కరీం, బొందిల శేషగిరి, మసనం శరత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





మైనారిటీల ఓట్లు కావాలి.. సంక్షేమం మాత్రం వద్దా?

మొదటిపేజీ తరువాయి

విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన', 'రేవంతన్నా కా సహారా' వంటి పథకాల ప్రకటనలతో ఆశలు కల్పించి, అమలు విషయంలో మాత్రం స్పష్టత ఇవ్వకపోవడం మైనారిటీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. ముస్లింల ఓట్లు కావాలి కానీ వారి బతుకులు మారాలనే ఆలోచన లేదా? అంటూ ఏఎండిఆర్ ఫౌండేషన్ ఫౌండర్ ఆదిల్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నారు.

ఏడు దశాబ్దాలు గడిచినా మారని బతుకులు!

భారతదేశం స్వాతంత్ర్యం సాధించి ఏడు దశాబ్దాలకు పైగా గడిచింది. దేశం సాంకేతిక, పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో ఎన్నో మైలురాళ్లు అధిగమించింది. కానీ ముస్లిం మైనారిటీ సమాజంలోని పేద కుటుంబాల పరిస్థితిలో ఆశించిన మార్పు ఎందుకు రావడం లేదు? విద్య, ఉద్యోగం, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాల్లో ఇంకా వెనుకబాటుతనం ఎందుకు కొనసాగుతోంది? రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించినా, ఆ హక్కుల ఫలాలు అట్టడుగు మైనారిటీ కుటుంబాలకు ఎంతవరకు అందుతున్నాయన్నది పాలకులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశం.

కమిషన్ల నివేదికలు బుట్టదాఖలా..

హామీలు మాత్రం కోకొల్లలు!

ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన వెనుకబాటుతనాన్ని సచార్ కమిటీతో పాటు పలు అధ్యయనాలు ఇప్పటికే వెల్లడించాయి. సమస్యల పరిష్కారానికి అనేక సిఫార్సులు చేసినా, వాటి అమలులో ప్రభుత్వాలు ఎందుకు వెనుకబడుతున్నాయి? నివేదికలు తయారుచేయడానికి, సమావేశాలు నిర్వహించడానికి, హామీలు గుప్పించడానికి ఉన్న ఉత్సాహం సమస్యల పరిష్కారానికి ఎందుకు కనిపించడం లేదు? మైనారిటీల అభివృద్ధి కోసం రూపొందించిన పథకాలు కాగితాలకే పరిమితమైతే వాటి వల్ల పేదలకు ఒరిగేదేమిటి? సంక్షేమం పేరుతో ప్రచార ఆర్భాటం చేయడం తప్ప ఆచరణలో మార్పు తీసుకురాకపోతే ఆ ప్రకటనలకు అర్థం ఏమిటి?

ఇందిరమ్మ పథకం ఎక్కడ?

రేవంతన్నా సహారా ఎవరికీ?

మైనారిటీ మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తామని ప్రకటించిన 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన', నిరుపేదలకు అండగా నిలుస్తామన్న 'రేవంతన్నా కా సహారా' పథకాల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ పథకాల ద్వారా ఎంతమందికి లబ్ధి చేకూరింది? అర్హులైన వారికి ఎప్పటిలోగా ఆర్థిక సహాయం అందిస్తారు? బడ్జెట్‌లో ఎంత నిధులు కేటాయించారు? లబ్ధిదారుల ఎంపికకు ఎలాంటి మార్గదర్శకాలు రూపొందించారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఎందుకు లేవు? పథకాల పేర్లతో మైనారిటీల్లో ఆశలు రేకెత్తించి, ఆచరణలో నిరాశ మిగిల్చడం ఎంతవరకు సమంజసం? మహిళా సాధికారత మాటల్లో కాదు.. ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి రుణాల రూపంలో కనిపించాలి.



12 శాతం రిజర్వేషన్లు..

రాజకీయ హామీలకే పరిమితమా?

ముస్లిం మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ ఏళ్ల తరబడి రాజకీయ వేదికలపై వినిపిస్తూనే ఉంది. పాలకులు మారినా మైనారిటీల ఆశలు మాత్రం మారడం లేదు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ అంశంపై తన స్పష్టమైన వైఖరిని ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత నుంచి తప్పించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. న్యాయపరమైన పరిమితులు ఉంటే వాటిని వివరించాలి. సాధ్యమైన ప్రత్యామ్నాయాలపై కార్యాచరణ ప్రకటించాలి. అంతేకానీ ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, తర్వాత మౌనం పాటించడం మైనారిటీలను మభ్యపెట్టడమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మైనారిటీ బడ్జెట్ ఏది? సబ్‌ప్లాన్ ఎందుకు లేదు?

మైనారిటీల అభివృద్ధికి ప్రత్యేక సమగ్ర బడ్జెట్, సబ్‌ప్లాన్ అమలు చేయాల్సిన అవసరం ఉంది. విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఉన్నత విద్యకు ప్రోత్సాహం, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధికి రుణాలు, మహిళలకు ఆర్థిక చేయూత అందించాలి. మైనారిటీ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలి. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలి. ఉర్దూ భాషకు రెండో అధికార భాష హోదా కల్పించిన రాష్ట్రంలో దాని అమలు పరిస్థితి ఏమిటో ప్రభుత్వం సమీక్షించాలి. కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో ఖర్చవుతున్నాయా? లబ్ధిదారులకు చేరుతున్నాయా? అనే అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

ఓట్లు అడిగే ముందు అభివృద్ధి లెక్కలు చెప్పండి!

ఎన్నికల సమయంలో మైనారిటీల ఇళ్లకు వెళ్లి ఓట్లు అడిగే నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే కుటుంబాల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా పరిగణిస్తూ తాత్కాలిక హామీలతో సంతృప్తిపరచే రాజకీయాలకు ఇకనైనా స్వస్తి పలకాలి. దేశాభివృద్ధిలో ముస్లిం సమాజానికి సముచిత భాగస్వామ్యం కల్పించాలి. విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రాజ్యాంగబద్ధమైన సమాన అవకాశాలు కల్పించాలి. మైనారిటీల హక్కులు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడినవి కావు.. అవి రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు.

ఆదిల్ ఘాటు ప్రశ్నలు..

రేవంత్ ప్రభుత్వానికి సూటి సవాల్!

ఏఎండీఆర్ ఫౌండేషన్ ఫౌండర్ ఆదిల్ మైనారిటీల సంక్షేమంపై ప్రభుత్వాల తీరును తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. ముస్లిం మైనారిటీల ఓట్లు కావాలి కానీ వారి అభివృద్ధి మాత్రం పట్టదా? ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు అధికారంలోకి వచ్చిన తర్వాత విలువ లేదా? ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన, రేవంతన్నా కా సహారా పథకాలు ఎప్పటి నుంచి పూర్తిస్థాయిలో అమలవుతాయి? 12 శాతం రిజర్వేషన్ల హామీపై పాలకుల చిత్తశుద్ధి ఏమిటి? అని ఆయన నిలదీస్తున్నారు.

మైనారిటీలను ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలకు ముగింపు పలకాలని, ప్రకటనలతో కాలయాపన చేయకుండా కార్యాచరణతో ముందుకు రావాలని ఆదిల్ డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, సంక్షేమ పథకాల అమలుకు కాలపరిమితి నిర్ణయించి, ప్రతి అర్హుడికి ప్రయోజనం అందించాలని కోరుతున్నారు.

రగ్బీ పోటీల్లో సర్వజ్ఞ స్కూల్ విద్యార్థుల ప్రతిభ.. ఘన విజయం

- **అండర్-14లో మూడో స్థానం.. అండర్-17లో నాలుగో స్థానం**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 27(భద్రాద్రి న్యూస్):-

కరీంనగర్ జిల్లాలో తెలంగాణ టచ్ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2వ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో ఖమ్మంలోని సర్వజ్ఞ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నారు. పోటీల్లో అండర్ 14 విభాగంలో మూడో స్థానం, అండర్ 17 విభాగంలో నాలుగో స్థానం సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు.

అండర్ 14 విభాగంలో అలోక్, మౌనిష్, దీక్షిత్, మోక్షజ్ఞ, శ్రీరామ్ భార్గవ్, అశ్విన్, సాయి కృష్ణ, దిగ్విజయ్‌లు మూడో స్థానాన్ని సాధించారు. అండర్ 17 విభాగంలో వేణు, భవిష్, హృతిక్ చంద్ర, కార్తీక్‌లు నాలుగో స్థానంలో నిలిచి తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు.

ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ టచ్ రగ్బీ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు సాధించిన విజయాలు ఎంతో గర్వకారణమని అన్నారు. క్రీడల్లో విద్యార్థులు చూపిన పట్టుదల, క్రమశిక్షణ, జట్టు సమన్వయం అభినందనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

పాఠశాల డైరెక్టర్ కె. నీలిమ మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం ఆనందంగా ఉందన్నారు. విజేతలకు, వారికి శిక్షణ అందించిన కోచ్‌లకు, ప్రోత్సాహం ఇచ్చిన తల్లిదండ్రులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విజేతలైన విద్యార్థులకు సర్వజ్ఞ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేసింది.



ఈ నెల 29న ఖమ్మంలో ఆర్యవైశ్య వనభోజనాలు

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 27 (భద్రాద్రిన్యూస్):-

ఖమ్మం నగరంలోని చెరుకూరి వారి తోటలో ఈరోజు నిర్వహించిన పత్రికా సమావేశంలో, ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం మరియు శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య అన్న సత్రం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ ఆదివారం ఆర్యవైశ్య వనభోజనాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య వన సమారాధన కమిటీ కన్వీనర్ చెరుకూరి కృష్ణమూర్తి, కోకన్వీనర్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్ తెలిపారు.

ఈ సందర్భంగా కార్యక్రమ వివరాలను వెల్లడిస్తూ, ఆదివారం ఉదయం 7:30 గంటలకు గోపూజ, ఉదయం 8 గంటలకు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, ఉదయం 10:30 గంటలకు మహాశివునికి అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఉదయం 9 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళలకు మరియు చిన్నపిల్లలకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి విందు భోజనాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఈ వన సమారాధన కార్యక్రమానికి ఆర్యవైశ్య సోదర, సోదరీమణులు, కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఈ పత్రికా సమావేశంలో పసుమర్తి సీతా చంద్ర రావు, చిన్ని కృష్ణారావు, గుమ్మడవెల్లి శ్రీనివాస్, గోళ్ళ రాధాకృష్ణమూర్తి, వేములపల్లి వెంకటేశ్వర రావు,పులిపాటి ప్రసాద్,రాయపూడి రవికుమార్, రాయపూడి జయరాం, మాశెట్టి వరప్రసాద్, పసుమర్తి సాంబశివరావు, గోళ్ళ మురళీకృష్ణ, తేరాల ప్రవీణ్ కుమార్, కొదమూరు జగన్నాథం,ఉటూరు లక్ష్మీ నరసింహారావు యడమకంటి రామారావు, బూర్ల పుల్లారావు, కందికొండ వేణుగోపాలరావు , కొంకిమల్ల మృత్యుంజయరావు, రాయపూడి బలరామ్మూర్తి పాలవరపు శ్రీనివాస్ చారిగుండ్ల రవి రంగా శ్రీనివాసరావు చెరుకూరి యుగంధర్ రంగా పురుషోత్తం కురువెల్ల లక్ష్మీనారాయణ కొంకిమల్ల విశ్వనాథం వంగవీటి హరీష్ రాయపూడి ఫణిరాజ్ తేలుకుంట్ల ఓంకార్ కాజా వెంకటేశ్వరరావు తేరాల భాస్కరరావు రాయల బసవేశ్వర రావు వెల్లంపల్లి సుబ్బారావు మాశెట్టి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం...

మొదటిపేజీ తరువాయి

యూనివర్సిటీని ఏర్పాటు చేసుకోవడం ఉమ్మడి ఖమ్మం జిల్లాకు దక్కిన గొప్ప అవకాశమని అన్నారు.

ఉమ్మడి జిల్లాలోని గిరిజన, దళిత, బీసీ, అన్ని బలహీన వర్గాల పిల్లల చదువుల కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ఒక్కో విద్యార్థిపై రూ. 1 లక్ష నుండి రూ. 1.25 లక్షల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తూ, అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తోందని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ఈ ప్రాధాన్యతను బలహీన వర్గాల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కష్టపడి చదివించుకుంటే, ఆ కుటుంబాలు శాశ్వతంగా ఆర్థిక భారం, పేదరికం నుండి బయటపడే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు.

ఖమ్మం జిల్లాకే కాకుండా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని, తద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి ఆశిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని, పేదల బిడ్డలంతా బాగా చదువుకుని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ప్రస్తుత హాస్టల్ భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, రాబోయే కొద్ది రోజుల్లోనే విద్యార్థుల ఉపయోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, విద్యా శాఖ ఇఇ బుగ్గయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ఆకలి తీర్చి... అక్షరాలకు వెలుగులు దిద్దుతున్న సింగరేణి

మొదటిపేజీ తరువాయి



సహకారం అందిస్తోంది. దేశానికి విద్యుత్ వెలుగులు అందించడమే కాకుండా, భావితరాల విద్యాభివృద్ధికి తోడ్పడటం ద్వారా ఉత్తమ పౌరుల నిర్మాణంలోనూ తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తోంది.

రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేయాలన్న ప్రభుత్వ సంకల్పంలో భాగంగా, ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క దిశానిర్దేశంలో హరే కృష్ణ ఫౌండేషన్ నిర్వహణలో సింగరేణి పరిధిలోని అన్ని చోట్ల, ఇతర చోట్ల సెంట్రలైజ్డు (కేంద్రీకృత) వంటశాలలు ఏర్పాటు చేస్తోంది. వీటిలో 9 వంటశాలల నిర్మాణానికి సింగరేణి నిధులు కేటాయించింది. పూర్తిగా సింగరేణి కార్పొరేట్ సామాజిక బాధ్య నిధులతో అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న ఈ 9 వంటశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 4 లక్షలకు పైగా విద్యార్థులకు నిత్యం ఉచితంగా పౌష్టిక అల్పాహారం అందించనున్నారు.

తొలిదశలో కొడంగల్‌లో నిర్మించిన సెంట్రలైజ్డు కిచెన్ (వంటశాల)కు రూ.2 కోట్లను మంజూరు చేసింది. ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్‌రెడ్డి ఈ వంటశాలను ప్రారంభించారు. కొడంగల్‌తో పాటు సమీపంలోని పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఇక్కడి నుంచి నిత్యం అల్పాహారం అందిస్తున్నారు.

తర్వాతి దశలో మధిర, మంథని, మంచిర్యాల ప్రాంతాల్లోకూడా సెంట్రలైజ్డ్ కిచెన్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. వీటి కోసం సింగరేణి సంస్థ 21.03 కోట్ల రూపాయలను సీఎస్ఆర్ నిధుల కింద మంజూరు చేసింది. అలాగే సింగరేణి, కొత్తగూడెం, భూపాలపల్లి, కాగజ్ నగర్, మునగాల (సూర్యాపేట) ప్రాంతాలలో త్వరలో నిర్మించనున్న సెంట్రలైజ్డ్ కిచెన్‌లకు 38.41 కోట్ల రూపాయలను సంస్థ కేటాయించింది.

గ్రామీణ ప్రాంతాల్లో పౌష్టికాహారం అందని పిల్లలకు ఈ పథకం కింద ఎంతో నాణ్యత గల ఆహారం మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్‌గా అందిస్తున్నారు. తద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉండటమే కాక అద్భుతంగా చదువుకునే అవకాశం ఏర్పడుతుంది. సింగరేణి సంస్థ ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల భవనాల నిర్మాణానికి, ఇతర సౌకర్యాల కోసం సామాజిక బాధ్యతగా నిధులు మంజూరు చేస్తుండగా.. ఇప్పుడు మరో ముందడుగు వేసి పౌష్టికాహారం తయారీకి వీలుగా కేంద్రీకృత వంటశాలల కోసం కూడా నిధులు మంజూరు చేస్తూ.. గ్రామీణ ప్రాంత పిల్లల చదువుకు ఎంతగానో దోహదం చేస్తోంది.

జిల్లాల వారీగా పథకం అమలు ఇలా ...

సింగరేణి సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా.. 4 లక్షల మంది పైగా విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. మొత్తం 9 చోట్ల ఈ అత్యాధునిక కిచెన్లను ఏర్పాటు చేస్తున్నారు. 8 వేల పాఠశాలలు ఈ కిచెన్ల పరిధిలోకి వస్తున్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: కొత్తగూడెం కేంద్రంగా 23 మండలాల పరిధిలోని 1,310 పాఠశాలలను అత్యధికంగా ఈ పరిధిలోకి రానున్నాయి. ఇందుకోసం రూ. 8.75 కోట్ల భారీ బడ్జెట్‌తో కేంద్రీకృత కిచెన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సూర్యాపేట: హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల పరిధిలోని 1,029 పాఠశాలలకు ఆహారాన్ని అందించేందుకు రూ. 9.61 కోట్ల భారీ వ్యయంతో కిచెన్ నిర్మిస్తున్నారు.

సింగరేణి(ఖమ్మం), మధిర: మధిరలో 879 పాఠశాలలను (16 మండలాలు) కవర్ చేస్తూ రూ. 7.53 కోట్ల తో ఏర్పాటు చేసిన కిచెన్ ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించడం ద్వారా మెరుగైన సమాజ నిర్మాణం జరగాలన్నదే లక్ష్యంగా పేర్కొన్నారు. అలాగే సింగరేణి ఖమ్మం ప్రాంతంలో 639 పాఠశాలలను (11 మండలాలు) కవర్ చేసేందుకు రూ. 8.96 కోట్లతో ఈ అత్యాధునిక వంటశాలను ఏర్పాటు చేయనున్నారు.

కొమురంభీమ్ ఆసిఫాబాద్ (కాగజ్‌నగర్): ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల పరిధిలోని 1,008 పాఠశాలలను అనుసంధానిస్తూ.. కాగజ్‌నగర్ కేంద్రంగా రూ. 7.53 కోట్లతో కిచెన్లను అందుబాటులోకి తీసుకు





ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

- **55వ డివిజన్‌లో బీమా పథకం నమోదు కార్యక్రమానికి శ్రీకారం**
- **ప్రారంభించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కోనేరు సత్యనారాయణ, కార్పొరేటర్ సింగర హరిహరన్**

కొత్తగూడెం , నవంబర్ 27(భద్రాద్రి న్యూస్):-

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని కొత్తగూడెం 55వ డివిజన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కోనేరు సత్యనారాయణ, డివిజన్ కార్పొరేటర్ సింగర హరిహరన్ ప్రారంభించారు.

ఈ పథకం ద్వారా కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణించిన సందర్భంలో కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించడంతో పాటు, కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా భరోసా కల్పించడమే ప్రధాన లక్ష్యమని నాయకులు తెలిపారు. పథకంలో నమోదైన అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా ప్రయోజనం అందించనున్నట్లు వివరించారు. కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హుల వివరాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఇతర ప్రభుత్వ బీమా పథకాల పరిధిలో ఉన్నవారి వివరాలను కూడా పరిశీలిస్తూ నమోదు ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకాన్ని అర్హులైన కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వై. శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నాగేందర్, యువజన సభ్యులు కిరణ్, పరమేష్, వార్డు ఆఫీసర్ సురేష్, టీపీబీఓ ప్రియాంక, డివిజన్ పెద్దలు, మహిళలు, స్థానిక కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





త్రివేణి పాఠశాలలో అంగరంగ వైభవంగా క్రీడా సంబరాలు

- **క్రీడలే ఆరోగ్యానికి పునాది- క్రీడా స్ఫూర్తే విజయానికి బాసట**

ఖమ్మం ప్రతినిధి ,నవంబరు 27 (భద్రాద్రిన్యూస్):-

త్రివేణి పాఠశాలలో క్రీడా సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్లూ,గ్రీన్,రెడ్, మరియు ఎల్లో హౌస్ పిల్లలు చాలా క్రమశిక్షణ తో మార్చిఫాస్ట్ కార్యక్రమాన్ని నివసించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డైరెక్టర్ డా.గొల్లపూడి వీరేంద్ర చౌదరి పంపిన సందేశం లో,పిల్లలలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి, శారీరక దృఢత్వం తో పాటు, క్రమశిక్షణ, ఐక్యత నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యం తో ప్రతీ సంవత్సరం ఈ క్రీడాపోటీలను నిర్వహిస్తామని తెలిపారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని ఆకాంక్షించారు....

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనూష, ఎస్.ఐ హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు,ఆటల యొక్క ప్రాముఖ్యతని వివరించారు.విశిష్ట అతిథిగా శ్రీ అప్పారావు, సి.ఓ - అడ్మిన్ పాల్గొని విద్యార్థులకు ప్రోత్సాహకరమైన సందేశాన్ని అందించారు.

పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ త్రివేణి పాఠశాల చదువుతోపాటు క్రీడలకి సమ ప్రాధాన్యం ఇస్తుందని, క్రీడలు విద్యార్థులలో గెలుపు ఓటములను సమానం గా స్వీకరించే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని, తమ పాఠశాల నుండి చాలా మంది విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు,పాఠశాల నిర్వాహకులు ఒలింపిక్ జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించి, ఒలంపిక్ బెలూన్లు ఎగురవేశారు. అతిథులంతా కూడా పోటీలలో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

ఈ సందర్భంగా విద్యార్థులు వాలీబాల్ , ఖోఖో, లెగ్ క్రికెట్ మొదలైన పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటూ తమ ప్రతిభను ప్రదర్శించారు.

విద్యార్థుల ఉత్సాహభరితంగా పాల్గొనడం, ఉపాధ్యాయుల సమన్వయం, పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహంతో క్రీడా సంబరాలు ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.





కోమట్లగూడెం సొసైటీలో నకిలీ 89 సభ్యత్వాల రద్దుకు ముదిరాజ్ సంఘం నేతల మద్దతు...

- **-రాష్ట్రవ్యాప్త ఉద్యమమని హెచ్చరిక..**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 27 (భద్రాద్రిన్యూస్) :-

కోమట్లగూడెం మత్స్యపారిశ్రామిక సంఘంలో అక్రమంగా చేర్చిన 89 నకిలీ సభ్యత్వాలను తక్షణమే రద్దు చేయాలని మన ముదిరాజ్ మహా సభ సంఘం నాయకులు డిమాండ్ చేశారు..

ఇటీవల ఒక అవినీతి అధికారి అండతో నిబంధనలను తుంగలో తొక్కి ఈ 89 సభ్యత్వాలను చేర్చిన విషయం 'పీపుల్స్ డైరీ' దినపత్రికలో ప్రచురితమై సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.. ఈ విషయంపై స్పందించిన ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ... అర్హులైన వారికి అన్యాయం చేస్తూ, అక్రమ పద్ధతుల్లో సభ్యత్వాలు పొందడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఈ వ్యవహారంలో పాత్ర ఉన్న అవినీతి అధికారిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.. అక్రమంగా నమోదైన 89 సభ్యత్వాలను వెంటనే రద్దు చేసి, పారదర్శకంగా అర్హులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ముదిరాజ్ సంఘం నాయకులు హెచ్చరిస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు..

ప్రధాన డిమాండ్లు& హెచ్చరికలు..

-అక్రమ సభ్యత్వాల రద్దు..

సొసైటీ నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని 89 మందికి సభ్యత్వాలు కల్పించారని ముదిరాజ్ నేతలు ఆరోపించారు.. దీనివల్ల అసలైన మత్స్యకారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు..



-ఉద్యమ హెచ్చరిక..

అధికారులు స్పందించి ఆ 89 నకిలీ సభ్యత్వాలను తక్షణమే రద్దు చేయాలని వారు కోరారు..ఒకవేళ అధికారులు నిర్లక్ష్యం వహించి, వాటిని రద్దు చేయని పక్షంలో ఈ సమస్యను రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మారుస్తామని ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు..

-న్యాయం జరిగే వరకు పోరాటం..

అర్హులైన ముదిరాజ్ బిడ్డలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని, అవసరమైతే రాష్ట్ర స్థాయి నేతల మద్దతుతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.. ఈ సమావేశంలో మన ముదిరాజు మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోప్పెర వెంకట నరసయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షులు ప్రతానపు వెంకటేశ్వర్లు ముదిరాజ్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కొప్పెర జానకి రాములు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కొమ్ము భాస్కర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు, మత్స్యశాఖ కన్వీనర్ బొమ్మకంటి సైదులు ముదిరాజ్, ఉపాధ్యక్షులు చింతనబోయిన సీతారాములు ముదిరాజ్, దంతాల కేశవులు ముదిరాజ్, గొడుగు నాగేశ్వరరావు ముదిరాజ్, బండారి శ్రీను ముదిరాజ్, కోశాధికారి ఓర వెంకటేశ్వర్లు ముదిరాజ్, కార్యదర్శులు పందుల ఉపేందర్ ముదిరాజ్, చామకూరి నాగేశ్వరరావు ముదిరాజ్, గోగుల శ్రీను ముదిరాజ్, నర్ల శేషయ్య ముదిరాజ్, కోమట్లగూడెం మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు పిట్టల వెంకటేశ్వర్లు ముదిరాజ్, జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు బుడిగె వెంకటేశ్వర్లు ముదిరాజ్, అడపా ప్రవీణ్ ముదిరాజ్, వివిధ మండలాల ముదిరాజు నేతలు, మత్స్యకార సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు..



ప్రజలకు మరింత మెరుగైన ట్రాఫిక్ సేవలు అందించాలి

- **వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి**
- **ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సీపీ కార్యాలయం తనిఖీ చేసిన భద్రాద్రి జోన్ ఇన్‌చార్జి డీఐజీ ఎన్. శ్వేత**

ఖమ్మం ప్రతినిధి ,నవంబరు 27 (భద్రాద్రిన్యూస్):-

ప్రజలకు మరింత మెరుగైన ట్రాఫిక్ సేవలు అందిస్తూ, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని వరంగల్ పోలీస్ కమిషనర్, భద్రాద్రి జోన్ ఇన్‌చార్జి డీఐజీ ఎన్.శ్వేత అన్నారు.

వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీఐజీ గారికి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాయుధ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ కమిషనర్ తో కలసి మొక్కలు నాటారు. ముందుగా పోలీస్ సిబ్బంది కిట్ నిర్వహణను పరిశీలించారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీసుల పనితీరు, స్టేషన్ నిర్వహణ, రికార్డులను పరిశీంచారు.

ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బందితో మాట్లాడుతూ...ట్రాఫిక్ విధుల నిర్వహణ అత్యంత కీలకమైన బాధ్యత అని, ప్రజా రవాణా వ్యవస్థ సజావుగా సాగడంలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. నిత్యం సామాన్య ప్రజల మధ్య ఉంటూ విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది సహనం, సంయమనం, ఓర్పుతో వ్యవహరించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజా రవాణాకు అంతరాయం కలగడంతో పాటు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూనే నిబంధనలను కఠినంగా అమలు చేయాలన్నారు. కాలుష్యం, దుమ్ము, వాహనాల పొగ మధ్య విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ...అవసరమైన రక్షణ పరికరాలు వినియోగించుకోవడంతో పాటు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం సీపీవో (పోలీస్ కమిషనర్ కార్యాలయం) పరిపాలన విభాగం, షీటీమ్, సీసీఆర్బీ, నార్కోటిక్, భరోసా సెంటర్ ను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. బఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్ శివప్రసాద్, అప్పలనాయుడు, రేంజ్ ఆఫీస్ సూపరిండెంట్ యాకుబ్ బాబా పాల్గొన్నారు.



కాటాపురం రామాలయంలో వైభవంగా కార్తీకమాస పూజలు

- **నెలరోజులుగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ప్రతిరోజూ ఆకాశదీపోత్సవం**
- **మహిళల ఆధ్వర్యంలో ధూప, దీప, నైవేద్యాలు.. భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం**

ఏటూరునాగారం క్రైం, భద్రాద్రిన్యూస్:

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లాలోని పలు గ్రామాల్లో ఆలయాలు భక్తిశ్రద్ధలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. నెలరోజులుగా గ్రామాల్లోని రామాలయాలు,శివాలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తాడ్వాయి మండలంలోని కాటాపురం రామాలయంలో కార్తీకమాస పూజలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.ప్రతిరోజూ మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని ధూప,దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.పసుపు,కుంకుమ, పూలు సమర్పించి స్వామివారిని భక్తితో కొలుస్తున్నారు.ప్రతిరోజూ రాత్రి 7.30 నుంచి 8 గంటల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ధ్వజస్తంభంపై ఆకాశదీపాన్ని వెలిగించి భక్తులు భక్తిపారవశ్యంలో పాల్గొంటున్నారు.అనంతరం కోటిదీపోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి తోరణాలతో అందంగా అలంకరించడంతో పండుగ వాతావరణం నెలకొంది.జై శ్రీ రామ్ నామస్మరణతో పాటు హరహర మహాదేవ శంభోశంకర నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగుతున్నాయి.క్రాస్‌రోడ్డు,పాత బస్టాండ్,బొడ్రాయి గుంపు, రామాలయం వీధి,బెస్తగుంపు, పెరకవాడ,దిడ్డోళ్లవాడ తదితర ప్రాంతాల నుంచి మహిళలు, చిన్నారులు,వృద్ధులు పెద్ద సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొంటున్నారు. పూజారి షణ్ముఖాచారి వేద మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కల్పిస్తున్నారు. కార్తీకమాసం ముగిసే వరకు ప్రతిరోజూ ఇదే విధంగా పూజలు,ఆకాశదీపోత్సవం కొనసాగనున్నాయి.దీంతో కాటాపురం రామాలయం భక్తులతో సందడిగా మారింది.

